
సాక్షి
ఖమ్మం
గురువారం । 9 । అక్టోబర్ । 2025

ప్రగతి సాధించేలా..
కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆది కర్మయోగి పథకం ద్వారా అభివృద్ధి చేసేందుకు ఉమ్మడి జిల్లాలో 165గ్రామాలను ఎంపిక చేశారు. 8లో



సర్వేనంబర్ల మాయాజాలం
సత్తుపల్లి మండలంలో పలుచోట్ల అసైన్డ్ భూములకు పట్టాభూముల సర్వే నంబర్లు వేసి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 25°
వాతావరణం
జిల్లాలో గురువారం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. సాయంత్రం తర్వాత వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి రాష్ట్ర టీ.టీ. ర్యాంకింగ్ టోర్నీ



ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 10నుంచి 12వ తేదీ వరకు బాలసాని సన్యాసయ్య మెమోరియల్ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీ నిర్వహించనున్నారు. ఇటీవల స్టేడియంలో నిర్మించిన టేబుల్ టెన్నిస్ హాల్‌లో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన 11 కేటగిరీల్లో ఈ పోటీలు జరుగుతాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 300 మంది బాలబాలికలతో పాటు 45 – 80 ఏళ్ల వయసు క్రీడాకారులు ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నారని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, వీవీఎస్.మూర్తి వెల్లడించారు.

మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఈ ఏడాది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. కళాశాలలో వంద సీట్లు భర్తీ కాగా, ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా వారం పాటు విద్యార్థులకు ఫౌండేషన్ తరగతులు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తొలిరోజు ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ వైద్య వృత్తి మహోన్నతమైనదని, విద్యార్థులు ఉన్నతంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కళాశాలలో అన్ని వసతులతో పాటు బోధకులు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

వైన్స్‌కు ఇప్పటికి 37 దరఖాస్తులే..



దరఖాస్తు స్వీకరిస్తున్న జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేందర్‌రెడ్డి

ఖమ్మంక్రైం: నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా జిల్లావ్యాప్తంగా 116 వైన్స్‌కు సంబంధించి బుధవారం వరకు 37 దరఖాస్తులు అందాయి. గత నెల 26వ తేదీన నోటిఫికేషన్ విడుదలైంది. అదేరోజు నుంచి ఖమ్మంలోని ఎక్సైజ్ స్టేషన్–1లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1 పరిధిలో 24, సత్తుపల్లికి నాలుగు, ఖమ్మం స్టేషన్–2, సింగరేణి స్టేషన్ల పరిధిలో మూడు చొప్పున, మధిరకు రెండు, వైరా సర్కిల్ పరిధిలో ఒక దరఖాస్తు అందిందని జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి నాగేందర్‌రెడ్డి అన్నారు. ఈనెల 18వ తేదీ వరకు గడువు ఉన్నందున వచ్చే వారం నుంచి దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. కాగా, ఇప్పటివరకు అందిన దరఖాస్తు ద్వారా రూ.3లక్షల చొప్పున ఎక్సైజ్ శాఖకు రూ.1.11 కోట్ల ఆదాయం సమకూరింది.

'పోలీస్' పెట్రోల్ బంక్ ప్రారంభం



పెట్రోల్ పోస్తున్న సీపీ సునీల్‌దత్, హెచ్‌పీసీఎల్ అధికారులు

కొణిజర్ల: పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన కొణిజర్ల పోలీస్‌స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన పెట్రోలు బంక్‌ను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ బంక్ ద్వారా నాణ్యమైన పెట్రోలు, డీజిల్ అందిస్తామని, తద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీస్ సిబ్బంది సంక్షేమానికే ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు మహేష్, నర్సయ్య, సుశీల్‌సింగ్, సీఐ సాగర్, ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు, నాగుల్‌మీరా, ఎస్‌ఐ సూరజ్, హెచ్‌పీసీఎల్ అధికారులు టీ.ఎన్.నఫ్వాద్, సమ్మయ్య, సంకేత్, బి.రాహుల్ పాల్గొన్నారు.

ఇక సమరమే..!



స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి అంతా సిద్ధమైంది. రిజర్వేషన్లపై కోర్టు తీర్పు కోసం ఆశావహులు బుధవారం రోజంతా ఉత్కంఠగా ఎదురుచూశారు. కోర్టు విచారణను వాయిదా వేసినా నోటిఫికేషన్ జారీపై అభ్యంతరాలు చెప్పలేదు. దీంతో గురువారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు అధికారులు సిద్ధమయ్యారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఈనెల 23, 27వ తేదీల్లో రెండు విడతలుగా జరగనుండగా ఫలితాలను వచ్చేనెల 11న వెలువరిస్తారు. ఈమేరకు ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

నేడు మొదటి విడత పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్

- తొలి దఫా పది జెడ్పీటీసీ, 149 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలు
- నేటి నుంచి 11వరకు నామినేషన్ల స్వీకరణ
- 23న తొలి విడత ఎన్నికల పోలింగ్

ఈనెల 23న మొదటి విడత

మొదటి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేస్తారు. ఈనెల 11వ తేదీ వరకు నిర్ణీత తేదీల్లో ఉదయం 10–30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఆపై 12వ తేదీ నామినేషన్లను పరిశీలించనుండగా, 13న అభ్యర్థులు అప్పీల్ చేసుకునే అవకాశముంది. అధికారులకు అందిన అభ్యంతరాలను 14న పరిష్కరించనుండగా, 15వ తేదీ సాయంత్రం 3 గంటలలోగా అభ్యర్థులు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఆతర్వాత అదేరోజు బరిలో మిగిలిన అభ్యర్థుల జాబితా వెలువరించి, ఈనెల 23న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

20 స్థానాలకు పది చోట్ల ఎన్నికలు

జిల్లాలో మొత్తం 20 జెడ్పీటీసీ, 283 ఎంపీటీసీలు స్థానాలు ఉన్నాయి. ఇందులో మొదటి విడతగా 10 జెడ్పీటీసీలు స్థానాలు, 149 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోకి వచ్చే కామేపల్లితో పాటు మధిర నియోజకవర్గంలోని ఐదు, పాలేరు నియోజకవర్గంలోని నాలుగు జెడ్పీటీసీ స్థానాలకే కాకుండా ఆ పరిధిలోని ఎంపీటీసీ స్థానాలకు మొదటి విడతలో ఎన్నికలు నిర్వహిస్తారు.

పకడ్బందీ ఏర్పాట్లు..

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎంపీటీసీ స్థానాల నామినేషన్లు స్వీకరించడానికి 108 మంది రిటర్నింగ్ అధికారులు, 113 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించారు. అలాగే ఏఈఓ(అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్)లను కూడా నియమించారు. వీరందరూ ఎన్నికల విధులతో పాటు అభ్యర్థుల నామినేషన్ల స్క్రూట్నీలో ఎంపీడీఓలకు సహకరిస్తారు. ఇక 40 మంది జోనల్ అధికారులు, 20మందితో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్లు మండల పరిషత్ కార్యాలయాల్లో స్వీకరిస్తారు. ఎంపీటీసీలకు సంబంధించి ఒక్కో మండలాన్ని ఐదు నుంచి ఆరు క్లస్టర్లుగా విభజించారు. మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో క్లస్టర్ల వారీగా నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

అంతా సిద్ధం..

మొదటి విడత పరిషత్ ఎన్నికలు జరిగే పది మండలాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం. పది జెడ్పీటీసీ, 149 ఎంపీటీసీ స్థానాలకు మొదటి విడతలో ఎన్నికలు జరుగుతాయి. నోటిఫికేషన్ విడుదల తోనే నామినేషన్లు స్వీకరణ మొదలవుతుంది. ఇందుకోసం మండలాల వారీగా రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఇతర సిబ్బందిని నియమించాం. అంతేకాక విధులపై వారికి పలు దఫాలు శిక్షణ ఇచ్చాం.

– అనుదీప్ దురిశెట్టి, కలెక్టర్

జెడ్పీటీసీ స్థానాలు : కామేపల్లి, బోనకల్, చింతకాని, మధిర, ముదిగొండ, ఎర్రుపాలెం, ఖమ్మంరూరల్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం

ఎంపీటీసీ స్థానాలు	149
పోలింగ్ స్టేషన్లు	836
బ్యాలెట్ బాక్సులు	1,621
పోలింగ్ ఆఫీసర్లు	1,002
అదర్ పోలింగ్ ఆఫీసర్లు	2,674

మండలాల్లో కోలాహలం..

స్థానిక సంస్థలతో గ్రామాల్లో సందడి ప్రారంభం కానుంది. నోటిఫికేషన్ విడుదలవుతుండడంతో ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. ఆపై గ్రామాల్లో ప్రచారం వేడెక్కుతుంది. ఇప్పటికే పార్టీల వారీగా అభ్యర్థులుగా ఎవరికి అవకాశం దక్కుతుంది.. అందులో ఎవరికి విజయావకాశాలు ఉన్నాయనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి.

ఖమ్మం సమగ్రాభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ నిర్మాణాలకు శంకుస్థాపన



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన మేయర్ నీరజ తదితరులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరాన్ని ఆధునిక సదుపాయాలతో తీర్చిదిద్దడం ద్వారా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపడమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. నగరంలోని 18వ డివిజన్ పరిధి ముస్తఫానగర్‌లో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నగరాభివృద్ధి కోసం తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రతీ అభివృద్ధి పని పది కాలాల పాటు మన్నికగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అర్హులైన పేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని చెప్పారు. ఖమ్మంను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రజలు ముందుకు రావాలని మంత్రి సూచించారు.

ఏఐ టాపర్‌కు అభినందనలు

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షలో జాతీయ స్థాయి టాపర్‌గా నిలిచిన ఖమ్మం రూరల్ మండలం ఆరెంపులకు చెందిన తాళ్లూరి పల్లవిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ఇటీవల పల్లవి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకుంది. ఈమేరకు ఆమెను అభినందించిన మంత్రి మాట్లాడుతూ పల్లవి విజయం ఇంకొందరు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు మందడపు లక్ష్మి, కమర్తపు మురళి, సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, ఎస్‌ఈ రంజిత్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మందడపు మనోహర్, పుచ్చకాయల వీరభద్రం, ఆళ్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని



మధిర పాలిటెక్నిక్ కళాశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల కానున్నందున నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని సూచించారు. హైదరాబాద్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఆమె పలు సూచనలు చేశారు. మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేసి, 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించాలన్నారు. ఆతర్వాత పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపుపై సూచనలు చేయగా, జిల్లాలో ఏర్పాట్లను కలెక్టర్ అనుదీప్ వివరించారు. ఆతర్వాత ఆయన అధికారులతో సమావేశమై నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తుపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, డీఎల్‌పీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

ఖమ్మం సహకారనగర్/మధిర/తల్లాడ: స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయడంతో పాటు పోలింగ్, లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలంలోని దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాల, మధిరలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తల్లాడ మండలం రెడ్డిగూడెంలోని జ్యోతి జూనియర్ కాలేజీల్లో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సెంటర్లకు జరుగుతున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి బుధవారం పరిశీలించిన సీసీ కెమెరాలు ఏర్పాటు, రిసెప్షన్ కౌంటర్ల నిర్వహణపై సూచనలు చేశారు. అలాగే, మధిరలో జరుగుతున్న ఉద్యోగుల శిక్షణను కలెక్టర్ పరిశీలించి గైర్హాజరైన ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, అదనపు డీసీపీ ప్రసాదరావు, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, ఆర్‌డీఓ నరసింహారావు, తహసీల్దార్లు ఆర్.రాంబాబు, సీఐలు మధు, సాగర్, ఎంపీడీఓలు వెంకటేశ్వర్లు, సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాసరెడ్డి, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణాపై విజిలెన్స్ ఆరా

- చింతకాని సెక్షన్ కార్యాలయంలో రికార్డుల తనిఖీ
- సెక్షన్ ఆఫీసర్ కవితపై సస్పెన్షన్ వేటు

ఖమ్మంవ్యవసాయం: కలప అక్రమ రవాణా వ్యవహారంపై హైదరాబాద్‌కు చెందిన విజిలెన్స్ అధికారుల బృందం బుధవారం జిల్లాలో తనిఖీలు నిర్వహించింది. చింతకాని సెక్షన్ పరిధి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్(ఎన్‌టీపీఎస్) విధానంలో కలప రవాణా జరిగినట్లు నిర్ధారించిన నేపథ్యాన విజిలెన్స్ అటవీ అధికారి ముకుందరెడ్డి ఆధ్వర్యాన అధికారులు సెక్షన్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్లు పొందే క్రమంలో స్మగ్లర్లు ట్యాంపరింగ్ చేసినట్లు గతంలోనే గుర్తించిన అధికారులు ఇందులో అటవీ శాఖ ఉద్యోగుల ప్రమేయం ఉందని తేల్చారు. సాధారణ కలప రవాణా చేయనున్నట్లు ఆన్‌లైన్‌లో పర్మిట్లు తీసుకోగా, వీటిని సమగ్రంగా పరిశీలించి అటవీ అధికారులు ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంటుంది. ఈక్రమంలో చింతకాని సెక్షన్ నుంచి ఎన్‌ఓసీలు జారీ చేసేటప్పుడు అక్రమాలు జరిగాయని గుర్తించారు. ఫలితంగా చింతకాని నుంచి తరలిస్తున్నట్లు చెబుతూ స్మగ్లర్లు విలువైన సంద్ర కలపను భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల నుంచి సేకరించి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర హరియాణా, గుజరాత్ రాష్ట్రాలకు రవాణా చేసినట్లు తేలగా రికార్డులు పరిశీలించిన విజిలెన్స్ బృందం కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా, కలప అక్రమ రవాణా వ్యవహారంలో చింతకాని సెక్షన్ అధికారి కవితను సస్పెండ్ చేస్తూ భద్రాద్రి జోన్ సీసీఎఫ్ భీమానాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలోనే ఇదే సెక్షన్ బీట్ ఆఫీసర్ శ్రీకాంత్‌ను డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ సస్పెండ్ చేసిన విషయం విదితమే. డీఎఫ్‌ఓ ఇచ్చిన నివేదిక ఆధారంగా కవితను కూడా సస్పెండ్ చేశారు. అయితే, ఈ వ్యవహారంలో ఇంకా ఒకరిద్దరిపై వేటు పడే అవకాశముందని సమాచారం.

పారదర్శకంగా ఎన్నికల విధులు

- ఎన్నికల వ్యయ నోడల్ అధికారి గంగాధర్



మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ నోడల్ అధికారి

ఖమ్మం సహకారనగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యోగులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల వ్యయ నోడల్ అధికారి గంగాధర్ సూచించారు. ఖమ్మం డీపీఆర్‌సీ భవనంలో జోనల్ అధికారులు, అకౌంటింగ్ బృందాలకు బుధవారం ఇచ్చిన శిక్షణలో ఆయన మాట్లాడారు. బృందాల బాధ్యులు నియమావళి అమల్లో ఉల్లంఘనలు, నగదు, బంగారం అక్రమ రవాణా కట్టడిపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా ఆడిట్ అధికారి భూక్యా హుస్సేన్ నాయక్, జిల్లా ఉపాధికల్పన అధికారి శ్రీరామ్ ఎన్నికల విధులపై అవగాహన కల్పించగా జోనల్ అధికారులు, నిఘా బృందాల అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు కీలకం

ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధుసూదన్



మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర, పక్కన ఎమ్మెల్సీ మధు, తదితరులు

ఖమ్మంవైరారోడ్: గ్రామ రాజకీయాలను శాసించే స్థానిక సంస్థల ఎన్నికలను కీలకంగా తీసుకుని పార్టీ అభ్యర్థుల విజయానికి బీఆర్‌ఎస్ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సూచించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా, ఏ రూపంలో వచ్చినా కూడా బీఆర్‌ఎస్ విజయఢంకా మోగించడం ఖాయమే అయినా కార్యకర్తలు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉండొద్దని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఖమ్మంలో బుధవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు అధ్యక్షతన జరగగా రవిచంద్ర మాట్లాడారు. గత 22 నెలల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడగా, అలవికాని హామీలు అమలుచేయలేకపోయారని ఆరోపించారు. అంతేకాక ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. అధికార పక్షం నాయకుల ప్రోద్బలంతో పెడుతున్న కేసులకు బీఆర్‌ఎస్ శ్రేణులు భయపడకుండా సంఘటిత శక్తితో ముందుకు సాగాలని సూచించారు. నెల రోజులు కష్టపడితే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయఢంకా మోగించడం ఖాయమని రవిచంద్ర తెలిపారు. ఎమ్మెల్సీ మధు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో పట్టణాల నాయకులు, కార్యకర్తలు, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికల్లో గ్రామాల నాయకులు ప్రచారం చేయడం ద్వారా ఘన విజయాలు నమోదవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోతు చంద్రావతి, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, నాయకులు ఉప్పల వెంకటరమణ, బమ్మెర రాంమూర్తి, పగడాల నాగరాజు, తిరుమలరావు, బెల్లం వేణుగోపాల్, బానోతు మంజుల, కట్టా అజయ్‌కుమార్, గిరిబాబు, కట్టా కృష్ణార్జునరావు తదితరులు ప్రసంగించారు.

ఇంతింతై.. వనమంతై!

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు

- 48వేల ఎకరాల నుంచి 1.22లక్షల ఎకరాలకు చేరిక
- అనుకూలిస్తున్న నేలలు.. ఇక్కడే పరిశ్రమలు
- సాగులో రాష్ట్రంలోనే అగ్రస్థానాన ఉమ్మడి ఖమ్మం



ఈ ఏడాది నాటిన ఆయిల్ పామ్ తోటలో రైతు

ఖమ్మంవ్యవసాయం: ఆయిల్ పామ్ విస్తీర్ణం ఉమ్మడి జిల్లాలో ఏటేటా పెరుగుతోంది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలకు తోడు అనుకూలిస్తున్న వాతావరణం, అందుబాటులో ఫ్యాక్టరీలు ఉండడం సాగు పెరగడానికి ఊతమిస్తోంది. సాగు విస్తీర్ణాన్ని పెంచాలని గత రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా.. రాష్ట్రంలోని 27 జిల్లాల్లో అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. దీంతో జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అధికారులు అవగాహన కల్పిస్తుండడంతో రైతులు కూడా ముందుకొస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు 3లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుంటే.. సింహభాగం ఉమ్మడి జిల్లాలోనే ఉండడం విశేషం.

ప్రభుత్వం నుంచి రాయితీలు

ఆయిల్‌పామ్ మొక్కలను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేయడమే నాలుగేళ్ల పాటు అవసరమైన ఖర్చులను అందిస్తోంది. రూ.193 విలువైన మొక్కను కేవలం రూ.20కే అందిస్తున్న ప్రభుత్వం ఏటా నిర్వహణ ఖర్చుల కింద ఎకరాకు రూ.4,200 రైతులకు చెల్లిస్తోంది. అలాగే, డ్రిప్ పరికరాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీపై అందిస్తున్నారు. మొత్తంగా ఎకరాకు రూ.50,918 రాయితీ అందుతోంది. ఇక ఆయిల్‌పామ్ సాగుతో 30 ఏళ్లపాటు ఆదాయం లభించనుండడం.. ప్రకృతి వైపరీత్యాలు, కోతుల సమస్య లేకపోవడంతో రైతులు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు వివరాలు

సంవత్సరం	ఖమ్మం		భద్రాద్రి	
	రైతులు	ఎకరాలు	రైతులు	ఎకరాలు
2019-20వరకు	1,897	8,232.67	10,016	40,063.5
2020-21	313	1,417.10	686	2,976.19
2021-22	700	3,009.03	1,013	4,237.50
2022-23	2,756	11,427.11	3,961	16,508.36
2023-24	1,255	4,605.025	2,402	8,953.00
2024-25	1,680	5,620.00	1,535	5,464.93
2025-26	1,858	6,034.40	1,124	3,802.50
మొత్తం	10,459	40,345.34	20,737	82,006



ఐదేళ్లలో 75వేల ఎకరాలు

ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా అగ్రస్థానాన నిలుస్తోంది. భద్రాద్రి జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటల్లో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యాన రెండు పరిశ్రమలు కొనసాగుతున్నాయి. అలాగే, ఖమ్మం జిల్లాలోని వేంసూరు, కొణిజర్ల మండలాల్లోనూ ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోంది. ఉంది. అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, మధిర, పాలేరు, ఖమ్మం ఉద్యాన డివిజన్లలో పంట సాగు విస్తీర్ణం అధికంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో 2019–20 వరకు 11,913 మంది రైతులు 48,296.19 ఎకరాల్లో పంట సాగు చేయగా.. 2025–26 సెప్టెంబర్ నాటికి 31,196 మంది రైతులు 1,22,351.34 ఎకరాల్లో పంట సాగు చేస్తుండడం విశేషం. తద్వారా ఐదేళ్ల కాలంలో ఆయిల్ పామ్ సాగు 74 వేల ఎకరాలు పెరిగినట్లయింది.

ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు



సుదీర్ఘకాలం ఆదాయాన్ని ఇచ్చే పంట కావడం, జంతువులు, చీడపీడల సమస్య లేకపోవడంతో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహకాలూ అందుతున్నాయి. ఇక్కడే ఫ్యాక్టరీలు ఉండడంతో సాగు పెరుగుతోంది.

– ఎం.వీ.మధుసూదన్, ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి

30 ఎకరాల్లో సాగు చేస్తున్నా...



ఆయిల్‌పామ్ సాగుతో ప్రయోజనాలను గుర్తించా. పత్తి, మిర్చి స్థానంలో 30ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు గత ఏడాది నాటాను. నష్టాలు లేక పోగా 30ఏళ్ల పాటు ఆదాయం వస్తుంది. ఫ్యాక్టరీలు కూడా దగ్గరే ఉన్నందున రవాణాకు ఇబ్బందులు ఉండవు.

– తాతా సీతారాం, రఘునాథపాలెం

క్లుప్తంగా

అల్లీపురంవైపే వెంకటేశ్వర స్వామి ఆలయం

ఖమ్మంఅర్బన్: తిరుమల, తిరుమతి దేవస్థానం ఆధ్వర్యాన ఖమ్మంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వినతితో ఏపీ సీఎం సానుకూలంగా స్పందించగా గతంలోనే టీటీడీ అధికారులు జిల్లాలో పర్యటించారు. ఆలయ నిర్మాణానికి పలు స్థలాలను పరిశీలించగా ఖమ్మం 15వ డివిజన్ అల్లీపురం పరిధి హైదరాబాద్–దేవరపల్లి హైవే వెంట ధంసలాపురం రెవెన్యూ సర్వే నంబర్లు 565, 563, 564, 560లో సుమారు 20 ఎకరాల భూమి అనువుగా ఉందని తేల్చారు. అంతేకాక అదే గ్రామంలో సర్వే నంబర్ 408లోని మరో 20 ఎకరాల భూమి కూడా అందుబాటులో ఉండడంతో పరిగణనలోకి తీసుకున్నారు. ఈ రెండింట్లో ఒక స్థలాన్ని ఆలయ నిర్మాణానికి త్వరలోనే ఖరారు చేసే అవకాశముంది. ఇప్పటికే నివేదికను రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి బి.శైలజా రామయ్యర్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి సమర్పించారు.

ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

కూసుమంచి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడం ద్వారా సత్తా చాటాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు సూచించారు. మండలంలోని పాలేరులో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతీ ఓటరును కలిసి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని తెలిపారు. తద్వారా పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షురాలు పుణ్యవతి, నాయకులు నున్నా రవికుమార్, రవిరాథోడ్, నల్లగట్టు ప్రవీణ్, వీరూగౌడ్, గడ్డం వెంకటేశ్వర్లు, మహేందర్ నాయక్, వీరన్న, భద్రయ్య, శంకర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి బీసీలు సిద్ధం కావాలి

ఖమ్మం మామిళ్లగూడెం: రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా తీర్పు వస్తే పోరాటానికి బీసీలు సిద్ధం కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి పిలుపునిచ్చారు. ఖమ్మంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీల వెనుకబాటుతనానికి రాజకీయ పార్టీలే కారణమన్నారు. ఈనేపథ్యాన 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధం కాగా, అడ్డుకుంటున్న వారు ద్రోహులుగా మిగిలిపోతారని తెలిపారు. సమావేశంలో నాయకులు లింగనబోయిన పుల్లారావు, మసనం శివరామకృష్ణ, గద్దె వెంకటరామయ్య, అమృతం మల్లికార్జున్, కూరపాటి సతీష్ మద్రిపల్లి భాస్కర్, బొల్లికొండ వెంకన్న, సామల సత్యం, జె.వెంకటేశ్వరరావు, ఆర్.గోపి పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

ఖమ్మంమయూరిసెంటర్: పిల్లల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలల సంరక్షణ కేంద్రాల్లో ఉంటున్న పిల్లలకు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించే ప్రక్రియ పదిహేను రోజుల్లో పూర్తిచేయాలని తెలిపారు. అలాగే, పోక్సో కేసుల నమోదు, విచారణపై ఆరా తీసిన కలెక్టర్.. బాధితులకు పరిహారం అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్ రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారి విష్ణువందన, సీడీపీఓలు పాల్గొన్నారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

ఖమ్మంరూరల్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా కలిశాక ముఖం చాటేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన యువతి, ఖమ్మం బోసు బొమ్మ సెంటర్‌కు చెందిన షేక్ సలీం 2020 నుంచి ప్రేమించుకుంటున్నారు. మూడేళ్ల పాటు కలిసి ఉన్నాక గత నెల 12న అరకులో పెళ్లి చేసుకుందామని చెప్పి యువతిని రైలులో పంపించి ఆయన వెళ్లలేదు. అంతేకాక ఆగస్టు 14న మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయమై బాధిత యువతి ప్రశ్నిస్తే సలీం, ఆయన కుటుంబీకులు చంపుతానని బెదిరించారు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	5,500	3,000
కందులు	5,300	5,300
మినుములు	2,100	1,800
ఏసీ మిర్చి	15,400	8,000
మిర్చి	8,200	6,500
కొత్త పత్తి	7,050	4,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,400

ప్రగతి సాధించేలా..



రచ్చబండలో సమస్యలను తెలుసుకుంటున్న ఐటీడీఏ పీఓ రాహుల్, ఇతర అధికారులు (ఫైల్)

- గిరిజన గ్రామాల సమగ్రాభివృద్ధికి ఆది కర్మయోగి పథకం
- ఉమ్మడి జిల్లాలో 28 మండలాల్లో 165 గ్రామాల ఎంపిక
- భద్రాద్రి జిల్లాలో రూ.1,355 కోట్ల అంచనాతో అభివృద్ధి ప్రణాళిక
- ఖమ్మం జిల్లాలో నివేదికను సిద్ధం చేస్తున్న అధికారులు

ఆది కర్మయోగి అభియాన్ పథకం

భద్రాచలం: వెనుకబాటుకు గురైన గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. విజన్–2030 పేరుతో గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక రూపొందించింది. ప్రజలను, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేస్తూ ఆదికర్మ యోగి అభియాన్ పథకం తెచ్చింది. దీని కింద భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 28 మండలాల్లో 165 గ్రామాలను ఎంపిక చేసింది. ఇప్పటికే నివేదికలను సిద్ధం చేసిన అధికారులు ఎన్నికల కోడ్ అనంతరం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు అందజేయనున్నారు.

28 మండలాలు.. 165 గ్రామాలు

సేవా, సంకల్పం, సమర్పణం నినాదాలతో ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, స్వయం ఉపాధి కల్పించనున్నారు. మొదటి ఫేజ్‌లో ఖమ్మం జిల్లాలో 9 మండలాల్లో 35 గ్రామాలకు అవకాశం కల్పించగా, 91,482 గిరిజనులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 19 మండలాల్లో 130 గిరిజన గ్రామాల్లో 1,37,108 మంది గిరిజనులు పథకం పరిధిలోకి రానున్నారు. కొత్తగూడెం, మణుగూరు మున్సిపాలిటీలను, భద్రాచలం పట్టణాన్ని ఈ పథకం నుంచి మినహాయించారు.

భద్రాద్రి జిల్లాలో రూ.1,355 కోట్లతో ప్రణాళిక

గిరిజన గ్రామాన్ని ప్రాతిపదికగా తీసుకుని ప్రణాళిక రూపొందించారు. ప్రతీ గ్రామంలో ఆది సేవా కేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన 20 మందిని సభ్యులుగా గుర్తించి సాతి, సహయోగిలను ఎంపిక చేశారు. జిల్లా, మండల, గ్రామాల్లో ట్రైబల్ వెల్ఫేర్, విద్య, వైద్య, రూరల్ డెవలప్‌మెంట్, శిశు సంక్షేమ శాఖకు చెందిన అధికారులను సభ్యులుగా నియమించారు. అధికారులు సాతి, సహయోగిల భాగస్వామ్యంతో ప్రతీ గ్రామంలో రచ్చబండ, గ్రామంలో నడక ద్వారా సమస్యలను గుర్తించారు. గ్రామ కార్యాచరణ ప్రణాళిక నివేదికను సిద్ధం చేశారు. ఆ గ్రామ అడవి, జలవనరులు, మౌలిక సదుపాయాల తదితర అంశాలకు ప్రణాళికలో చోటు కల్పించారు. భద్రాద్రి జిల్లాలో 130 గ్రామాల్లో సుమారు రూ.1,355 కోట్ల నిధుల అవసరాన్ని గుర్తించారు. ఖమ్మం జిల్లా అధికారులు తుది నివేదికను అందజేయాల్సి ఉంది.

నివేదికలు సిద్ధం



జిల్లా, మండల, గ్రామల స్థాయిలో మాస్టర్ ట్రైనింగ్ పూర్తి చేశాం. గ్రామాల్లో పర్యటించి నివేదికలను సిద్ధం చేశాం. నివేదికలు గ్రామసభల్లో ఆమోదం పొందాక జిల్లా లెవల్ రివ్యూ మీటింగ్ అనంతరం అప్రూవల్‌కు పంపిస్తాం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ కారణంగా ఈ ప్రక్రియ ఆగిపోయింది. కోడ్ ముగియగానే ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికలను అందచేస్తాం.

–దేవిడ్‌రాజ్, ఏపీఓ జనరల్, భద్రాచలం ఐటీడీఏ

విజన్-2030 ద్వారా అభివృద్ధి..

కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి గిరిజన గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక వసతులను కల్పించాలని భావి స్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి నివేదికలను అందగానే నిధులను విడుదల చేసే అవకాశం ఉంది. ప్రతీ గ్రామానికి ఐదేళ్ల కాలంలో సుమారు రూ.2కోట్ల ఖర్చు చేయనున్నట్లు తెలుస్తోంది. అధి కారులు మాత్రం గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులపై స్పష్టమైన వివరాలతో నివేదికలను రూపొందించారు. అంతర్గత రోడ్లు, చెక్ డ్యాంలు, తాగు, సాగు నీరు వసతులు, విద్యుత్, ఇళ్ల నిర్మాణం, బోర్లు తదితర అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికల్లో మార్పులు

విడతల వారీగా మారిన మండలాలు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల తేదీల్లో అధికార యంత్రాంగం స్వల్ప మార్పులు చేసింది. జిల్లాలో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ఇప్పటికే ప్రకటించారు. అలాగే, విడతల వారీగా మండలాల జాబితా కూడా ఖరారు చేశారు. కానీ ఈ జాబితాలో కొన్ని మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలోని 20మండలాల్లో 571 జీపీలకు గాను 5,214 వార్డులు ఉన్నాయి. వీటిలో మార్పుల ఆధారంగా మొదటి విడతగా ఏడు మండలాల్లో, రెండో విడత ఆరు మండలాల్లో, ఏడు మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తారు.

మొదటి విడత (పోలింగ్ : 30-10-2025)

మండలం	జీపీలు	వార్డులు
కొణిజర్ల	27	254
రఘునాథపాలెం	37	308
వైరా	22	200
బోనకల్	22	210
చింతకాని	26	248
మధిర	27	236
ఎర్రుపాలెం	31	284

రెండో విడత (పోలింగ్ : 04-11-2025)

మండలం	జీపీలు	వార్డులు
కామేపల్లి	24	218
ఖమ్మం రూరల్	21	202
కూసుమంచి	41	364
ముదిగొండ	25	246
నేలకొండపల్లి	32	300
తిరుమలాయపాలెం	40	356

మూడో విడత (పోలింగ్ : 08-11-2025)

మండలం	జీపీలు	వార్డులు
ఏన్కూరు	25	216
కల్లూరు	23	214
పెనుబల్లి	33	298
సత్తుపల్లి	21	208
తల్లాడ	27	252
వేంసూరు	26	244
సింగరేణి	41	356

నూరు శాతం టీకాల లక్ష్యాన్ని సాధించాలి



టీకాల ఆవశ్యకతను వివరిస్తున్న వెంకటరమణ

ఎర్రుపాలెం: పిల్లలు, గర్భిణులు, బాలింతలకు వ్యాక్సిన్లతో ఉపయోగంపై అవగాహన కల్పిస్తూ నూరు శాతం లక్ష్యాలను సాధించాలని జిల్లా వాక్సిన్ మేనేజర్ సీహెచ్.వెంకటరమణ సూచించారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు పీహెచ్‌సీలో వ్యాక్సిన్ నిల్వలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆతర్వాత పలు సబ్ సెంటర్లలో వ్యాక్సినేషన్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేయడమే కాక గర్భిణులకు అవగాహన కల్పించారు.డాక్టర్ అశ్విని, సిబ్బంది అరుణ, నస్రత్, అమృత్, వెంకటేశ్వరరావు, వేణుగోపాల్, వెంకటేశ్వరరెడ్డి, స్నేహ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

11న అండర్-19 హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 బాలబాలికల హ్యాండ్‌బాల్ జట్లను ఈ నెల 11న ఎంపిక చేయనున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపిక పోటీలు జరుగుతాయని జిల్లా క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసా కలీం తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు కళాశాల గుర్తింపు కార్డు, ఎస్సెస్సీ మెమో జిరాక్స్ తీసుకురావాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

ధాన్యం కొనుగోళ్లకు కార్యాచరణ

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న ధాన్యం కొనుగోళ్లకు కార్యాచరణ రూపొందించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఖమ్మంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్‌లో 2.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఈ ఏడాది 3.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటుచేయడమే కాక అవసరమైన వేయింగ్, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, గన్నీబ్యాగ్‌లు సిద్ధం చేయాలని చెప్పారు. అంతేకాక ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించేలా వాహనాలు సమకూర్చుకోవాలని తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు గంగాధర్, డి.పుల్లయ్య, జి.శ్రీలత, ఎం.ఏ.అలీం, చందన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల వద్ద ఏర్పాట్లు

దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాల ఏర్పాటుకు అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ని పోలీస్, మునిసిపల్, రెవెన్యూ, పంచాయతీ శాఖల సమన్వయంతో షాపుల ఏర్పాటుకు స్థలాలు ఖరారు చేయాలని తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో షాపుల ఏర్పాటుకు నిబంధనలకు అనుగుణంగా అనుమతులు జారీ చేయాలని సూచించారు. అలాగే, దీపావళి రోజుల ఆస్పత్రుల్లో 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ ప్రసాదరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జకీరుల్లా, జిల్లా అగ్నిమాపక అధికారి బి.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీ డ్రా విజేతల ఎంపిక

డ్రా తీసిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



విజేతలను ప్రకటిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: బతుకమ్మ, దసరా సెలవుల్లో రీజియన్ వ్యాప్తంగా ఆర్టీసీ డీలక్స్, సూపర్‌లగ్జరీ, రాజధాని, లహరి బస్సుల్లో ప్రయాణించిన వారి నుంచి విజేతలను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ప్రయాణికులు తమ వివరాలతో టికెట్లను డిపోల వారీగా బాక్సుల్లో వేయగా ఏడు డిపోల టికెట్లను ఖమ్మం తీసుకొచ్చి కొత్త బస్టాండ్‌లో బుధవారం డ్రా తీశారు. రీజినల్ మేనేజర్ సరిరామ్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి లక్కీ డ్రా ముగ్గురు విజేతలను ప్రకటించారు. ఖమ్మం డిపో నుంచి రాజధాని బస్సులో ప్రయాణించిన కాంతారావు, భద్రాచలం డిపో సూపర్‌లగ్జరీ బస్సులో ప్రయాణించిన సాయిబాబా, మణుగూరు డిపో నుంచి డీలక్స్ బస్సులో ప్రయాణించిన పి.సునీల్‌ను ఎంపిక చేయగా, వీరికి హైదరాబాద్‌లో బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ ఆర్ఎం వి.మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్, సెక్యూరిటీ అధికారి కోటాజీ తదితరులు పాల్గొన్నారు.

సర్వే నంబర్ల మాయాజాలం



గాడిదల వాగు బ్రిడ్జి కింద నింపుతున్న మట్టి

- అసైన్డ్ భూములకు పట్టా సర్వే నంబర్లు
- ఆపై యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు

సత్తుపల్లి: అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమార్కుల లీలలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. సత్తుపల్లి రెవెన్యూ పరిధితో పాటు అయ్యగారిపేట రెవెన్యూలో పట్టా భూముల సర్వే నంబర్లను అసైన్డ్ భూములకు వేసి దర్జాగా రిజిస్ట్రేషన్లు చేయించడం వెనుక ఓ ముఠా ఉన్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ల సమయాన అధికారులు పట్టా నంబర్లు ఉండడంతో చకచకా పని పూర్తిచేస్తున్నారు. అయితే, ఈ మాయాజాలంలో అధికారుల పాత్రపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏదిఏమైనా అక్రమార్కుల తీరుతో అసైన్డ్, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులు వివాదాస్పద భూములను కొనుగోలు చేసి రికార్డుల్లో మార్పులు, చేర్పులు చేసి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఒకే నంబర్ అన్నింటికీ..

సత్తుపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 166లో పట్టా భూమి ఉంది. అయితే, చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములకు సైతం ఇదే సర్వేనంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు తెలిసింది. దీంతో సర్వే నంబర్‌లోని భూమి కంటే అధిక విస్తీర్ణం నమోదవుతుండగా.. భవిష్యత్‌లో వాస్తవ పట్టాదారులకు ఇబ్బంది ఎదురయ్యే అవకాశముంది. ప్రభుత్వాలు దళితులు, బీసీలకు పంపిణీ చేసిన అసైన్డ్, ప్రభుత్వ వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చినట్లు సమాచారం. ఇందులో భాగంగానే అయ్యగారిపేటలోని సర్వే నంబర్ 38/ఊలో జొన్నలగడ్డ పున్నయ్యకు చెందిన అసైన్డ్ భూమిని సమీప వెంచర్ యజమానులు తప్పుడు సర్వే నంబర్‌తో ఆక్రమించినట్లు పున్నయ్య వారసుడు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చడానికి మరో ఎత్తుగడ కూడా వేస్తున్నట్లు సమాచారం. ఏదైనా రెవెన్యూ పరిధిలో రైతుకు భూమి కన్నా రికార్డుల్లో అదనంగా నమోదై ఉంటే ఆ భూమిని రికార్డులో ఎక్కించి అదే సర్వే నంబర్‌తో క్రయవిక్రయాలు చేస్తున్నట్లు తెలిసింది.

గాడిదల వాగు అన్యాక్రాంతం

సత్తుపల్లి శివారు కాకర్లపల్లి రోడ్డులో గాడిదల వాగు అన్యాక్రాంతమవుతోంది. తామర చెరువు నుంచి అలుగు పోసుకొని గాడిదల వాగు మీదుగా ప్రవాహం వేశ్యకాంతల చెరువుకు వెళ్తుంది. దీనికోసం 40 మీటర్ల వరద కాలువను సైతం రైతులు స్వచ్ఛందంగా వదులుకున్నారు.

అయితే, ఇక్కడ బ్రిడ్జి చిన్నగా ఉండడంతో వర్షాకాలంలో తరచూ వరద పోటెత్తి రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. దీంతో తుమ్మల నాగేశ్వరరావు ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఐదు కానాలతో హైలెవల్ బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి పక్కన ఉన్నవి పట్టా భూములు కావటంతో బ్రిడ్జి కానాలను మట్టితో పూడ్చేస్తున్నారు. ఒకవేళ పట్టా భూములైనా వ్యవసాయానికే ఉపయోగించాలని, ఎఫ్‌టీఎల్‌కు మించి భూములను మట్టితో చదును చేయడం చట్టవ్యతిరేకమని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా హైలెవల్ బ్రిడ్జి నిర్మించినా రోడ్డుపైకి వరద చేరు తూ కాకర్లపల్లిరోడ్డు తదితర ప్రాంతాలు మళ్లీ ముంపునకు గురవుతున్నాయి. అలాగే, సత్తుపల్లి నలు దిక్కుల పూర్వకాలంలో ఉన్న నాలుగు నీటి కుంటలు సైతం అన్యాక్రాంతమైనట్లు తెలుస్తోంది.

రౌడీషీటర్ మహేష్ అరెస్టు

ఇప్పటికే 18కేసులు.. పదేళ్ల జైలుశిక్ష

ఖమ్మంఅర్బన్: చట్టవిరుద్ధమైన కార్యకలాపాలతో ప్రజల్లో భయభ్రాంతులు సృష్టిస్తున్న రౌడీషీటర్ జే.కే.మహేష్‌తో పాటు మరో నిందితుడు రబ్బానీని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. నిందితుడు మహేష్ గంజాయి సరఫరా చేస్తుండడమే కాక దాడులు, దౌర్జన్యాలు, హత్యాయత్నం, భూకబ్జాల్లో పాల్గొంటున్నాడని వెల్లడించారు. ఇటీవల శ్రీనగర్ కాలనీలోనూ దాడికి పాల్పడగా అరెస్ట్ చేశామని తెలిపారు. గతంలో మధ్యప్రదేశ్‌లోని మోరెనా జిల్లాలో నమోదైన గంజాయి కేసులో మహేష్‌కు పదేళ్ల జైలుశిక్ష పడిందన్నారు. అంతేకాక వివిధ పీఎస్‌ల పరిధిలో 18 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. పలు కేసుల్లో జైలుశిక్ష అనుభవిస్తూ బెయిల్‌పై బయటకు వచ్చిన మహేష్ మళ్లీ నేరాలకు పాల్పడుతుండడమే కాక ప్రముఖులతో దిగిన ఫొటోల ఆధారంగా ప్రజల్లో భయభ్రాంతులు సృష్టిస్తున్నాడని సీఐ భానుప్రకాశ్ పేర్కొన్నారు.

కారులో వచ్చి చోరీకి యత్నం!

సొత్తు ఎత్తుకెళ్తూ పట్టుబడిన నిందితుడు



పొదల్లో పడిన నగదు, బంగారం కోసం వెతుకుతున్న స్థానికులు



పట్టుబడిన నిందితుడు వంశీకృష్ణ

ఖమ్మంఅర్బన్: ఎవరికీ అనుమానం రాదనుకున్నాడో.. పారిపోవడం సులువవుతుందని భావించాడో తెలియదు కానీ ఓ ప్రబుద్ధుడు ఏకంగా కారులో చోరీకి వచ్చాడు. కాస్త దూరంలో కారు నిలిపి ఇంటి తాళం పగులగొట్టి నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్తుండగా అదే సమయానికి యాజమానులు రావడం, వారి కేకలతో స్థానికులు అప్రమత్తమవడంతో నిందితుడు పట్టుబడ్డాడు. యజమానులతో పాటు స్థానికుల చాకచక్యంతో నిందితుడు పట్టుబడగా చోరీ యత్నం బెడిసికొట్టినట్లయింది. ఖమ్మం జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీ రోడ్డు నంబర్–8లో బుధవారం పట్టపగలే జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఇంటి యజమాని తాళ్లూరి శ్రీనివాసరావు దంపతులు తాళం వేసి సమీపంలో బ్యాంక్‌కు వెళ్లారు. అర గంట తర్వాత వారు వచ్చే సరికి తాళం తొలగించి ఉంది. దీంతో లోపలకు వెళ్తుండగా ఆగంతకుడు మరో తలుపు గుండా బయటకు వెళ్తూ 'మీ కోసం అంటీ చూస్తోంది' అంటూ పరుగులు తీశారు. దీంతో శ్రీనివాసరావు దంపతులు ఆయనను దొంగగా గుర్తించి వెంటపడి కేకలు వేస్తుండడంతో ఖమ్మం – వైరా ప్రధాన రహదారిపై నిలిపిన కారు వద్దకు పరుగు తీశాడు. ఇంతలోనే స్థానికులు అప్రమత్తమై ఆయనను పట్టుకోగా కంపచెట్లలోకి దూకే సమయాన సదరు నిందితుడు చోరీ చేసిన నగదు, బంగారం కిందపడ్డాయి. ఈమేరకు స్థానికులంతా ఆయనను బంధించి సమీపంలోని ఖమ్మం అర్బన్ స్టేషన్‌లో అప్పగించారు.

గుంటూరు వాసి.. హైదరాబాద్‌లో నివాసం

చోరీకి యత్నించిన వ్యక్తిని పోలీసులు అప్పగించగా విచారణ చేపట్టారు. ఈమేరకు నిందితుడిని వంశీకృష్ణగా గుర్తించగా, ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్ ఎల్‌బీ నగర్ మల్సూర్‌గూడలో నివాసముంటున్నట్లు తేలింది. గతంలో పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడ్డాడని సమాచారం. ఈ విషయమై ఖమ్మంఅర్బన్ సీఐ భానుప్రకాష్‌ను వివరణ కోరగా బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని, పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

అల్ట్రాస్కానింగ్ యంత్రం స్వాధీనం

నిబంధనల విరుద్ధంగా స్కానింగ్ నిర్వహణ?



స్వాధీనం చేసుకున్న యంత్రం వద్ద డీఎంహెచ్ఓ, ఉద్యోగులు

ఖమ్మంఅర్బన్: గర్భిణుల స్కానింగ్ ఉపయోగించే పోర్టబుల్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈమేరకు ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లోని ఓ ఇంట్లో పోర్టబుల్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కళావతిబాయి తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ చందు నాయక్, ఖమ్మం అర్బన్ పోలీసులతో కలిసి తనిఖీ చేయగా యంత్రాలు లభించాయని, ఈ సమయాన పాండురంగాపురానికి చెందిన ఎస్.వెంకటేష్, వైఎస్ఆర్ కాలనీకి చెందిన బానోత్ హుస్సేన్ ఉండడంతో కేసు నమోదు చేశామని చెప్పారు. కాగా, రిజిస్ట్రేషన్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా గర్భిణులను స్కానింగ్ చేస్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించామని తెలిపారు. ఇప్పటివరకు ఎందరికి స్కానింగ్ చేశారు, ఎవరికైనా అబార్షన్ చేయించారా అన్న అంశాలపై విచారణ చేపడుతున్నట్లు డీఎంహెచ్ఓ వెల్లడించారు.